## నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విచారణ జరపాలి

**సిద్దిపేట రూరల్, జూన్ 9, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంగెం మధు, జేరిపోతుల జనార్ధన్‌లు అదివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 5న పరీక్షను నిర్వహించడం జరిగిందని దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వారి అనుమానాలకు ప్రత్యక్ష సాక్ష్యం అరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం వారి పరీక్ష కేంద్రం ఒకటే కావడం వలన అనుమానాలకు బలానిస్తుందన్నారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల సిఎంలు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడేదల చేసిన ఫలితాలపై పేపర్ లీకేజీలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జీచే విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## గ్రూప్ 1 ప్రిలిమినరి పరీక్ష కేంద్రాల డిఎస్పీ వెంకట్‌రెడ్డి తనిఖీ



నర్సాపూర్‌లోని బివిఆర్ఐటి కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్ 1 ప్రిలిమినరి పరీక్షలకు లోనికి వెళుతున్న అభ్యర్థులు తదితరులు

**నర్సాపూర్ జూన్ 9. ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్రపబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆదేశాల మేరకు గ్రూప్ 1 ప్రిలిమినరి పరీక్షలు ఆదివారం నర్సాపూర్ లో ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలు నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు సెంటర్‌లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఈ పరీక్షా సెంటర్‌ల వద్ద డీఎస్పీ వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పరీక్షలకు ఉదయం 8 గంటల 30 నిమిషాలకు అబ్యర్థులను పరీక్షా కేంద్రం లోని కి అనుమతించారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు లోనికి తీసుకువెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోపలికి అనుమతించారు. 10 గంటల తర్వాత ఎవ్వరిని అనుమతించకుండా పరీక్షా కేంద్రాల గేట్లన్ని మూసివేయించారు. కాగా అంతలోనే ఒక అభ్యర్థి 2 నిమిషాల ఆలస్యంగా రావడంతో ఆ అభ్యర్థిని పరీక్షకు అనుమతించకుండా తరిగి పంపించి వేశారు. సి సి కెమెరాలు నిఘా మధ్యన ఈ పరీక్షలు నిర్వహిస్తుండగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి తో పాటు నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్, డివిజన్ పరిధిలోని పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్న దృశ్యం



పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లాలో అదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ రాత పరీక్ష పకడ్బంధీ ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ముగిసింది. నిమిషం అలస్యం నిబంధనతో అభ ্యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అభ యర్థులను క్షుణంగా పరిశీలించిన తర్వాత పరీక్ష కేంద్రాల లోకి అనుమతించారు. ఉదయం 10-30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 8239 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 6705 అభ్యర్థులు పరీక్ష రాయగా 1534 మంది అభ్యర్థులు హాజరు కాలేదు. బయోమెట్రిక్ సిస్టంతో పూర్తి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద ముందుజాగ్రత్త చర్యగా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేశారు. ఉదయం 10 గంటల తర్వాత పరీక్ష కేంద్రాల గేట్లు మూసి వేశారు. పరీక్షా కేంద్రాలలోకి బ్యాగులు, సెల్‌ఫోన్లు, సా ్మర్ట్ ఫోన్లు, చేతిగడియారాలు, క్యాలిక్యులేటర్ తదితర ఎలక్ట్రానికట్ పరికరాలు అనుమతించలేదు.

**పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్**
జిల్లాలో అదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ రాత పరీక్ష జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి వికాస్ హై స్కూల్, న్యూ జనరేషన్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలలో పరీక్ష జరుగుతున్న తీరును అయన పరిశీలించారు. అలాగే జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, సీపీ డా॥ అనురాధ వివిధ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

**మెదక్ పట్టణంలో..**
**సంగారెడ్డి బ్యూరో, జూన్9 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ మోడల్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ తీరును, పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అభ్యర్థుల హాజరును, పరీక్ష కేంద్రంలోని సీసీ టీవీల పనితీరును చూశారు. రోల్ నెంబర్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రంలో ఉన్న మౌలిక వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు వ్రాసే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. 144 సెక్షన్ అమలును, మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆదివారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆదేశాలకు అనుగుణంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ నిర్వహించామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తెలిపారు. జిల్లాలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించామని అన్నారు. జిల్లాలో మొత్తం 3,912 మందికి గాను 10 పరీక్ష కేంద్రాల్లో 3,125 మంది పరీక్షకు హాజరయ్యారు. 787 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని, హాజరు శాతం 79.88 శాతంగా నమోదు అయిందని కలెక్టర్ తెలిపారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్ష కేంద్రంలో కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-1 పరీక్ష...

## ఘనంగా బోనాల ఊరేగింపు
### -కన్నుల పండుగగా అమ్మవారి కళ్యాణం

**రామాయంపేట, జూన్ 9, ప్రభాతవార్త ః**
రామాయంపేట మండల పరిధిలోని ఆర్. వెంకటాపూర్ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం నాడు స్థానిక దుర్గామాత అమ్మవారికి బోనాలు, బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజున గ్రామ దేవతలకు పలారం బండ్లు ఊరేగింపు నిర్వహిస్తామని యాదవులు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా పడి, పాడి పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఈ బోనాల పండత కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. శనివారం రోజున బోనాలు బండ్ల ఊరేగింపు నిర్వహించామని తెలిపారు. ఆదివారం రోజున దుర్గమాతకు కళ్యాణం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కళ్యాణ ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కళ్యాణం

**కొల్చారం, జూన్ 9, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని దేవుని వెంకటాపూర్ గ్రామంలో వెంకటేశ్వర ఆలయంలోఆదివారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా, కనుల పండుగగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని వెంకటేశ్వర ఆలయ అనువంశిక ధర్మకర్త పట్వారి ప్రసాదరావు ఆధ్వర్యంలో కులచాల కృష్ణ శర్మ మంత్రోచ్చారణల మధ్య జరిపారు. ఉదయం నుండి ఆలయంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం మహిళలు స్వామి వారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం శ్రీ వెంకటేశ్వర నామ స్మరణతో మారుమ్రోగింది. అనంతరం భక్తులందరు మొక్కులను చెల్లించుకున్నారు. పురోహితులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. భక్తులకు అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్వారి ప్రసాదరావు మాట్లాడతూ శ్రీ వేంకటేశ్వర స్వామి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నేడి నుండి ప్రజావాణి
### -జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి మున్సిపాలిటి మే 9, ప్రభాతవార్త:**
నేటినుండి ప్రజావాణి కార్యాక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళి ఆమలులో ఉన్నందున ప్రజావాణి కార్యాక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని, ఎన్నకల కోడ్ ముగిసినందున ప్రజావాణి కార్యాక్రమాన్ని సోమవారం నుండి యాదావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

## గేదెలపై తెగిపడ్డ విద్యుత్ తీగలు...4 గేదెలు మృతి



గంగోజిపేటలో విద్యుత్ తీగలు పడి 4 గేదెలు మృతి చెందిన దృశ్యం

**చౌటకూరు, జూన్ 9, ప్రభాతవార్త:** గేదెలపై విద్యుత్ తీగలు తెగిపడటంతో కరెంట్ షాక్‌తో 4 గేదెలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గంగోజిపేటలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన మంగలి మహేందం, సుందరయ్య, షఫీ మహమ్మద్‌లు సాకుతున్న గేదెలు మేత మేసేందుకు అడవిలోకి వెళ్లాయి. విద్యుత్ తీగలు తెగిపోయి పంట చేనులో పడటంతో తీగలు గేదెలకు తాకడంతో షాక్‌కు గురై అక్కడకి అక్కడే 4 గేదెలు మత్యువాత పడ్డాయన్నారు. విద్యుత్ అధికారులు తమకు నష్టపరిహారం అదించి ఆదుకోవాలని బాధితులు వినతి చేశారు.

## నాగల్‌గిద్దలో పిడుగుపడి గేదె మృతి

**నాగల్‌గిద్ద, జూన్ 9, ప్రభాతవార్త:** పిడుగు పడి గేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన నాగల్‌గిద్దలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బీమప్ప తన ఇంటి సమీపంలో తను సాకుతున్న గేదెను చెట్టు కింద కట్టేనాడు. ఆదివారం పిడిగు పడటంతో చెట్టుకు కట్టేసిన 9వేల రూపాయల విలువ గల గేదె మృతి చెందిందన్నారు. పేదవాడినైన తనను ప్రభుత్వ ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు భీమప్ప వినతి చేశారు.

## రెండు తలల దూడ జననం

**చిన్నశంకరంపేట, జూన్ 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఆవు రెండు తలల వింత దూడకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన రైతు నర్సింలుకు చెందిన ఆవు ఆదివారం పురటినోప్పులతో బాధపడుతూ అవస్థలు పడుతుండగా వెంటనే ఈ విషయాన్ని మండల పశువైద్య సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది నవీన్, గోపాల మిత్ర మహేష్‌లు ఆవుకు వైద్య పరిక్షలు నిర్వహించారు. సుమారు రెండు గంటలకు పైగా శ్రమించి దూడను అతికష్టం మిద బయటకు తీశారు. దూడ బయటకు రాగానే రెండు తలలు ఉండటాన్ని గమనించారు. ఈ దూడను చూసేందుకు గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా ఈ దూడ పుట్టిన వెంటనే మరణించింది. తరువాత తల్లి ఆవు కూడ చనిపోయింది. పిండం అభివృద్ధి చెందే క్రమంలో ఏర్పడే జన్యు లోపం వల్ల అరుదుగా ఇటువంటి దూడలు జన్మిస్తాయని, ఇలా జన్మించిన దూడలు బతకడం కష్టమే అని పశు వైద్యులు తెలిపారు.



రుద్రారంలో రెండు తలల దూడ జన్మించిన దృశ్యం

## అయిల్‌ఫామ్‌తో రైతులకు అధిక ఆదాయం

**- రైతు భరోసా వెంటనే అందించాలి**
**-రైతులను చిన్న చూపు చూస్తున్న కాంగ్రెస్ సర్కారు**
**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**

**నంగునూర్, జూన్ 9, ప్రభాతవార్త:**
అయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక అదాయం వస్తుందని ప్రతి రైతు అయిల్‌ఫామ్ తోటలు పెంచడానికి ముందుకు రావాలని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. అదివారం మండల పరిధిలోని అక్కనపల్లి గ్రామంలో రైతు నాగేంద్రం వ్యవసాయ క్షేత్రంలో పెట్టిన పామాయిల్ తోట మొదటిసారి కోతకు వచ్చిన అయిల్ ఫామ్ గేలను ఎమ్మెల్యే హరీష్‌రావు తెంపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను చిన్న చూపు చూస్తుందన్నారు. రైతులకు రైతు భరోసా పెట్టుబండి వెంటనే అందించాలన్నారు. బిఆర్ఎస్ సర్కారు అధికారంలో ఉన్నంత కాలం సకాలంలో రైతులకు రైతు పెట్టుబడి అందించడం జరిగిందన్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ అందించాలన్నారు. ఎరువులు, విత్తనాల కోరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అయిల్‌ఫామ్ తోటల వలన రైతులకు అధిక అదాయం వస్తుందని కోతకు వచ్చిన పంటను ట్రాన్స్ ఫోర్టుతో సహ రైతులకు అందిస్తూ ప్రభుత్వం కొనుగోలు చేసి ఖమ్మంకు పంపించడం జరుగుతుందన్నారు. అయిల్‌ఫామ్ పంటతో ఎకరాకు రూ. లక్ష 20 వేల అదాయం వస్తుందన్నారు. నర్మెటలో రూ. 3 వందల కోట్లతో 120 టన్నుల క్రషింగ్ సామర్థ్యంతో అయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఫ్యాక్టరీ పనులు శరవేగంగా సాగుతున్నాయని ఏప్రిల్ నెలలో ఫ్యాక్టరీని ప్రారంభించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట జిల్లానే కాకుండా జనగాం, మహబూబాబాద్, గద్వాల్, నారాయణపేట, భువనగరి తదితర జిల్లాలకు ఫ్యాక్టరీ కేంద్ర బిందువుగా నిలుస్తుందన్నారు. జిల్లాలో 11268 ఎకరాల్లో అయిల్ ఫామ్ పంట సాగు చేయడం జరుగు తుందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని బిఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, మల్లయ్య, వెంకటరెడ్డి, అనగోని లింగంగౌడ్, కోల రమేష్‌గౌడ్, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అయిల్‌ఫామ్ గెలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

## డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

**ములుగు, జూన్ 9 (ప్రభాతవార్త):**
డివైడర్‌ను ఢీకొని ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన ములుగు గ్రామ శివారులో చోటుచేసుకుంది. ములుగు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం రామ కృష్ణాపూర్ గ్రామానికి చెందిన బూషణమైన నాంపల్లి(32) అనే వ్యక్తి కరీంనగర్‌లో మామిడిపండ్ల వ్యాపారం చేస్తున్నాడు. అర్ధరాత్రి టిఎస్ 21 4544 నెంబర్ గల బజాజ్ పల్సర్ వాహనంపై హైద్రాబాద్‌లోని వారి బంధువుల ఇంటికి వెళ్తుండగా అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడంతో ములుగు గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ళ వద్దకు చేరుకోగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కింద పడ్డాడు. దీంతో అతని తలకు, చేతులకు, ఇతర భాగాలపై తీవ్ర గాయాలు కావడంతో సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ అతన్ని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## ఢీకొన్న కారు లారీలు
### -ఇద్దరు మృతి



జాతీయ రహదారిపై ఢీకొన్న లారీలు, కారులు

**సదాశివపేట, జూన్ 9, ప్రభాతవార్త:** జాతీయ రహదారిపై కారు, రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మంల పరిధిలోని నాగ్సాన్‌పల్లి వద్ద యూటర్న్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న కారు లారీలు ఢీకొన్నాయన్నారు. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు, లారీలో ప్రయాణిస్తున్న మరొకరు అక్కడికి అక్కడే మృతి చెందారన్నారు. పలువురికి గాయలయినట్లు, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించామన్నారు. ప్రమాదానికి గురైన వ్యక్తుల ఆచూకి కోసం పోలీసులు విచారణ చేస్తున్నారు.

## రాజీమార్గమే కక్షిదారులకు రాజమార్గం
### -లోక్ అదాలత్‌లో 2131 కేసులు పరిష్కారం

**సంగారెడ్డి టౌన్, జూన్ 9, ప్రభాతవార్త:**
రాజీమార్గమే రాజ మార్గమని జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి అన్నారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 2131 కేసులను కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకున్నారన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ 489 ఐపిసి, 216 సైబర్ క్రైమ్, 1018 ఈ-పెట్టి కేసులు, 428 డిడి కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. సైబర్ మార్గంలో డబ్బులు కోల్పోయిన 211 మంది సైబర్ క్రైమ్ బాధితులకు లబ్ది చేకూరిందన్నారు. సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్న తరుణంలో సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణరాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరోను డైరెక్టర్ శిఖాగోయల్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో డి4సిని ఏర్పాటు చేసి డిఎస్‌పి స్థాయి అధికారులచే పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెల మొదటి బుధవారాన్ని సైబర్ జాగురుకత దివస్‌గా నిర్వహిస్తున్నామన్నారు. సైబర్‌లో 25వేల రూపాయల కన్నా తక్కువగా ఉంటే నగదును తిరిగి బాధితులకు అందించేందుకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీని ప్రత్యేకంగా కలిసి సంబంధిత జిల్లాలకు డిఎల్ఎస్‌పలకు ఎస్ఓపిని పంపించారన్నారు. జిల్లాలోని ఆయా పోలీసు ఠాణాల్లో నమోదైన 216 కేసులను పిఎల్‌సి కేసులుగా పరిగణించి సైబర్ క్రైమ్ నందు బాధితులకు 24లక్షల 45వేల 550 రూపాయలను ఇప్పించేందుకు సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు ఆర్డర్ కాపీలను పంపించడం జరిగిందన్నారు. జిల్లాలో సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫోన్ చేసి లేదా ఎన్‌సిఆర్‌పి పోర్టల్ నందు లాగిన్ అయి ధరఖాస్తు చేయవచ్చన్నారు.
జాతీయ మెగో లోక్ అదాలత్‌ను విజయవంతం చేసిన డి4సి డియస్‌పి వేణుగోపాల్‌రెడ్డ, ఇన్స్‌పెక్టర్ రవి డిఎస్‌ఆర్బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఎస్ఐ సత్యనారాయణ, కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్‌పి అభినందించారు.

## ముగిసిన గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష
### -హాజరైన 7530 మంది అభ్యర్థులు

**సంగారెడ్డి బ్యూరో మే 9, ప్రభాతవార్త:**
ఆదివారం జరిగిన గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వాహణకు కేంద్రాలను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లు సందర్శించి, పరీక్షల నిర్వాహణ తీరును పరిశీలించారు.. సంగారెడ్డిజిల్లాలో నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షకు 9672 మంది అభ్యర్థులు హాజరు కావలపి ఉండగా, 7530 మంది హాజరయ్యారు. 2142 మంది అభ్యర్థులు పరీక్షలు రాయడానికి గైర్హజరయ్యారు. జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల అనంతరం పరీక్షకేంద్రాల గేట్లను మూసివేశారు. పరీక్షలకు హాజరయ్యో అభ్యర్థుల సౌకర్యార్థం, ఆదనపు ఆర్టీసి బస్సులను నడిపినట్లు అధికారులు తెలిపారు.



సంగారెడ్డిలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**పాపన్నపేట, జూన్ 9, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతూ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొత్తపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామానికి చెందిన టప్పు మల్లేశం (38) కౌలుకు భూమి తీసుకుని వ్యావసయం చేస్తూ వస్తున్నాడు. గత ఏడాది కురిసిన వడగళ్ల వానతో పంట నష్టం జరగడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మే30న కైలుకు తీసుకున్న పొలం వద్దకు వెళ్లి పురుగు మందు సేవించాడన్నారు. అదే సమయంలో పొలం వద్దకు వెళ్లిన భార్య భర్త పురుగుల మందును సేవించినట్లు గుర్తించి స్థానికుల సహాయంలో చికిత్స నిమిత్తం జిల్లా అసుపత్రికి తరలించారు. జిల్లా అసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కొరకు నీమ్స్ ఆసుపత్రికి తరలించగా నీమ్స్‌లో చికిత్స అందుకుంటూ ఆదివారం తెల్లవారు జాము కానరాని లోకాలకు చేరిపోయాడన్నారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై నరేష్ వివరించారు.

# బడిబాట.. ఉత్తుత్తిమాట..!

-కనిపించని సర్కారు టీచర్ల ప్రచారం

-క్షేత్ర స్థాయికి వెళ్లని 65శాతం మంది

-పిల్లలతో ఇంటి ఎదుట

ఫోటోలు దిగి గ్రూప్‌లో అప్‌లోడ్

-నీరుగారుతున్న లక్ష్యం



**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:**

బడీడు పిల్లలు, వివిధ కారణాలతో స్కూల్ మానేసి విద్యార్థులను చేరదీసి వారికి విద్యా బుద్దులు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిన బడిబాట కార్యక్రమం లక్ష్యం నీరుగారి పోతోంది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లాల్లో మొక్కుబడిగా సాగుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో చాలామంది ఉపాధ్యాయులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ఇంటిలో కాలక్షేపం చేస్తున్నారు. మరికొందరు ప్రధానోపాధ్యాయుల ఒత్తిడి మేరకు ఇంటి చుట్టుపక్కల పిల్లల పేర్లను తూతూమంత్రంగా నమోదు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ పేరిట ప్రభుత్వం ఏటా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్ ఉన్నందున జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని రూపొందించారు. ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ పాఠశాలల్లో కొత్త అడ్మిషన్లను పెంచేందుకు కృషి చేయాలి. ఇందులో భాగంగా ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు జూన్ 19 వరకు పాఠశాలల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. రెండు వారాల పాటు జరిగే బడిబాటకు సంబంధించి ప్రభుత్వం ఒక్కో స్కూల్‌కు రూ. 5వేల బడ్జెట్‌ను కేటాయించింది. దీంతో పాఠశాలల వారీగా బ్యానర్లు, కరపత్రాలు ముద్రించి ఇంటింటికి తిరుగుతూ నూతన చేరికలు చేయించాలి.

**బంధువుల పిల్లల ఫోటోలు అప్‌లోడ్...**

జిల్లాలోని ఉపాధ్యాయులు తమ పాఠశాల పరిధిలోని బస్తీలు, కాలనీల్లో ఉదయం 9 నుంచి 12 వరకు తిరుగుతూ సర్కారు బడులపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించి పిల్లలను బడిలో చేర్చేందుకు ఒప్పించాలి. పాఠశాలలో చేరడానికి అంగీకరించిన పిల్లల పేర్లు, తల్లిదండ్రుల వివరాలతో పాటు వారి ఫోటోలను తీసి మండల స్థాయిలో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే వేసవి సెలవులు ముగియకముందే బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంపై కొంతమంది ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో బంధువులు, ఇంటి చుట్టుపక్కల పిల్లల ఫోటోలను మొక్కుబడిగా తీస్తూ అప్‌లోడ్ చేస్తున్నారు. కాగా, ఇలా నమోదు చేస్తున్న పిల్లలందరూ ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పటికే చదువుతుండడం గమనార్హం. 35శాతం మంది టీచర్లు మాత్రమే నిబద్ధతతో పనిచేస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎర్నింగ్ లీవ్స్ (ఈఎల్) ఇవ్వడం లేదు దీంతో ఉపాధ్యాయులు బడిబాటపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

## సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కింది

**యూసుఫ్‌గూడ, జూన్ 9, ప్రభాతవార్త :**

ప్రతి పేదవాడికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి చౌరస్తాలో దాదాపు 13మందికి కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను స్థానిక కార్పోరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఈకార్యక్రమంలో కైసర్ జహాన్, గీత గౌడ్, మాదవి, అమ్మాజీ, అరుణ, అశోక్, ప్రసన్న, బాలరాజు, చిన్న, శరత్, నవీన్‌పటేల్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో సంబురాలు

**తార్నాక, జూన్ 9 ప్రభాతవార్త :**

ప్రధానిగా మూడో సారి నరేంద్రమోది, మంత్రులుగా కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం సాయంత్రం తార్నాక చౌరస్తాలో బిజేపీ శ్రేణులు స్వీట్లు పంచి, టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్, కొన్నె సంపత్, మల్లికంటి వీరన్న, ఆకుల శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, ఉపేందర్ యాదవ్, ఆకుల శ్రీనివాస్, ప్రకాష్ గౌడ్, నరసింహ్మ, రాజు జైన్, గర్వమోహన్, జమ్మికుంట వేణు, కృష్ణమూర్తి తో తదితరులు పాల్గొన్నారు.

## మోదీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** భారత ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ మూడవసారి ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొనేందుకు దేశ రాజధాని ఢిల్లీకి ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బిజెపి నేతలు ఆదివారం వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బిజెపి మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, బిజెపి ముషీరాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి పూస రాజు, బిజెపి అధికార ప్రతినిధి రాజు నేత, నవీన్ తదితరులున్నారు.

# కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి

-అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం -సంబురాల్లో బిజెపి శ్రేణులు

**హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త**

భాగ్యనగరానికి ఉన్నత పదవి దక్కింది. కేంద్ర కేబినెట్‌లో సికింద్రాబాద్ నుంచి గెలుపొందిన గంగాపురం కిషన్‌రెడ్డికి మరోసారి కేంద్ర మంత్రిగా అవకాశం లభించింది. ఆదివారం రాత్రి ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ప్రజలు, బిజెపి కార్యకర్తలు హర్షాతికేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానం నుం చి పోటీ చేసిన కిషన్‌రెడ్డి విజయం సాధించారు. గతంలోనూ ఇదే స్థానంలో గెలిచారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా కూడా కొనసాగుతున్నారు.

కిషన్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపురం గ్రామంలో జన్మించారు. టూల్ డిజై నింగ్‌లో డిప్లొమా చేశారు. 1977లో జనతా పార్టీ యువమోర్చా నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. అంతకు ముందు ఆయన సంఘ్ కార్యకర్త. 1980లో బిజెపి ఆవిర్భాం నుంచి పార్టీలో పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. ఆదే ఏడా ది రంగారెడ్డి జిల్లా బిజెపి యువమోర్చా కన్వీనర్‌గా బాధ్యతలు 1982-83లో బిజెవైఎం రాష్ట్ర కోశాధికారిగా, 1983-84లో బిజెవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, 1986-1990 వరకు ఐదేళ్ల పాటు బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడుగా, 1992 ఉంచి 1994 వరకు బిజెవైఎం జాతీయ ఉపాధ్యక్షుడు గా, 1994-2001 వరకు బిజెవైఎం జాతీయ ప్ర ధాన కార్యదర్శిగా, 2001లో భారతీయ జనతా పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోశాధికారిగా, 2004లో భారతీయ జనతా యువమోర్చా జాతీ య అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టారు. బిజెపిలో కీలక నేతగా ఎదిగిన కిషన్‌రెడ్డి తొలిసారి హిమా యత్‌నగర్ శాసనసభ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం నియోజకవర్గం పునర్విభజన కారణంగా 2009లో అంబర్‌పేట నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేశా రు.2014 ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి మళ్లీ గెలుపొందారు. 2016 నుంచి 2018 వరకు అసెంబ్లీలో బిజెపి శాసన సభాపక్ష నేతగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి పోటీ చేసిన కిషన్‌రెడ్డి ఓటమి పాలయ్యారు.

2019లో సికింద్రాబాద్ ఎంపీగా గెలిచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2021లో కేబినెట్ విస్తరణలో భాగంగా క్యాబినెట్ మంత్రిగా నియమితులయ్యారు.ఇటీవల వరకు అతను కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మరియు ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రిగా కూడా పనిచేశారు.



ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి (ఫైల్‌ఫోటో)

## అంబేద్కర్ ఆశయాలు...ఆలోచనలకు అనుగుణంగా పరిపాలన

-స్పీకర్ గడ్డం ప్రసాద్

**నాచారం, జూన్ 9 ప్రభాతవార్త :**

అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన సాగుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద అరుంధతి సంక్షేమ సంఘం ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన డా.బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి బిజి సర్కిల్లో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్బంగా చేవూరి వారి కుమార్తె చేవూరి ఉషశ్రీ ఆద్వర్యంలో వందలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా చేవూరి సుదర్శన్, చేవూరి ఉషశ్రీ చేస్తున్న సేవలను గుర్తించి స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బేతిసుభాష్ రెడ్డి, కార్పోరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, సాయిజన్ శేఖర్, మాజీ కార్పోరేటర్లు గొల్లురి అంజయ్య, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ పి.మోహన్ మురళి, అరుంధతి సంక్షేమ సంఘంఅధ్యక్షులు యెడల మల్లేష్, ప్రధాన కార్యదర్శి బొల్లంపల్లి ప్రకాష్, ఉపాధ్యక్షులు కె. నర్సింహ్మా, టి.మల్లయ్య, వి.యాదయ్య, యెల్లయ్య, కె. లక్ష్మణ్, వై. యాదగిరి, టి.నరసింహ్మా,ఎల్లయ్య, ఎం.చిన్నా బాలరాజు,మేకల రాజు, చినింగల్ల శ్రీనివాస్, నల్లబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.



చేవూరి సుదర్శన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే బిఎల్ఆర్

## గతే ఏడాదికంటే ఈయేడు తగ్గింది





**గోషామహల్, జూన్ 9 ప్రభాతవార్త:**

చేప ప్రసాదం వేయించుకునే వారి సంఖ్య గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం చేపప్రసాదం వచ్చే భారీ తగ్గింది.మత్స్య శాఖ అధికారులు శనివారం ఉదయం 9గంటల 30 నిమిషాలకు ప్రారంభమై ఆదివారం చేపప్రసాదం ముగిసే వరకు 55వేల440మందికి చేపప్రసాదం వేసినట్లు నాంపల్లి తహసిల్దార్ ప్రేమ్‌కుమార్ తెలిపారు.దీనికితోడు ఉబ్బసం వ్యాధిగ్రస్తులు బెల్లం,ద్వారా ప్రసాదాన్ని వేయించుకున్నారు.శనివారం ఉదయం 9గంటల 30 నిమిషాలకు మృగశిర కార్తె ప్రారంభంతో కావడంతో బత్తిని సోదరులు మంత్రి పొన్నంప్రబాకర్‌గౌడ్,ప్రజాప్రతినిధులు చేపప్రసాదాన్ని వేసి ప్రారంభించారు.చేపప్రసాదాన్ని 34 కౌంటర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు చేప ప్రసాదాన్ని వేశారు.ఈ చేపప్రసాదాన్ని ఇతరశాఖల అధికారులు చేపప్రసాదం పంపిణి కార్యక్రమం సక్రమంగా జరిగే విధంగా పర్యవేక్షించారు.కాగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన చేప ప్రసాదం కోసంవివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతి ఒక్కరికి చేప ప్రసాదం పంపిణి చేసిన బత్తిని కుటుంబ సభ్యులకు,వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా ఆల్పహారం, భోజనం అందించిన స్వచ్చంద సంస్థలు,స్వచ్చందంగా సేవలు అందించిన వ్యాలంటీర్లతోపాటు జిహెచ్ఎంసి, పోలీసు,ట్రాఫిక్,విదు య్త్, జలమండలి, హెల్త్, శానిటేషన్,ఫైర్,మత స్య,ఆర్అండ్‌బి తదితర శాఖల అధికారులతోపాటు ఎగ్జిబిషన్ సొసైటి సభ్యులు సహకరించారు.

## దైవ చింతనలో సానియా మిర్జా

-కుటుంబంతో సహా హజ్ యాత్రకు ప్రయాణం

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:**

జీవితంలో ఒక్కసారైనా పవిత్రమైన మక్కా మసీదు సందర్శనకై హాజ్ యాత్ర చేయాలని ముస్లింలు అందరూ కలగంటారనీ, షరతులు, నియమ నిష్టలతో కూడిన ఈ యాత్ర చేయడం తన కల కూడా అనీ భారత టెన్నీస్ దిగ్గజం సానియా మిర్జా అన్నారు. భర్తతో విడాకులు తరువాత జీవితాన్ని కొత్తగా మొదలు పెట్టిన ఆమె, తన ఒంటరితనాన్ని జయించేందుకు దైవచింతన మీద దృష్టి పెట్టారు. అందులో భాగంగా ఆదివారం తన కుటుంబంతో కలిసి పవిత్రమైన మక్కా మసీదు సందర్శనకై హాజ్ యాత్రకు బయలుదేరారు. జూన్ 14 శుక్రవారం నుండి హాజ్ యాత్ర మొదలు కానున్న నేపథ్యంలో, ఆమె తన కలను సాకారం చేసుకునేందుకు మక్కాకి వెళ్తున్నట్లు సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో తెలిపారు. తన ప్రార్థనలు అల్లా స్వీకరించాలని కోరుకుంటూ, జీవితంలో తానేదైనా తప్పు చేసుంటే క్షమించాలని, తనకు జీవితంలో మంచి వైపు పయనించేలా మార్గ దర్శనం చేయాలని కోరారు. తాము చేస్తున్న హాజ్ యాత్ర కోసం ఆమె కుటుంబం కూడా స్పందిస్తూ పోస్ట్ చేసింది.

## బిసి కులాలు సంఘటితంగా ఉండి హక్కులను కాపాడుకోవాలి

-ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



గంగపుత్ర సంఘ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** అన్ని బీసీ కులాలు సంఘటితంగా వ్యవహరిస్తూ తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. బద్ధనగర్‌లో గంగపుత్ర స్థానిక సంఘం నూతన భవన ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ పాల్గొని కార్యాలయాన్ని లంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము తొలినుంచే బీసీ కులాల సంక్షేమానికి అత్యధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. అన్ని వెనుకబడిన కులాల వారికి అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ వారిని తమవంతు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా తాము బీసీల హక్కులను పొందేందుకు సహకరిస్తామని పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. పద్మారావుగౌడ్ తన వ్యక్తిగత విరాళాన్ని సంఘానికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్, ప్రము ఖ హైకోర్టు న్యాయవాది దేశబోయిన రఘు, కైరంకొండ యాదగిరి, సత్యానారాయణ, ప్రభాకర్, పాకమూర్తి, శైలజ,, నారాయణలు పాల్గొన్నారు.

## రన్నింగ్ బస్సు దిగుతూ ఆర్టీసీ డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 9, ప్రభాతవార్త**

రన్నింగ్‌లో ఉన్న ఆర్టీసీ బస్సును దిగుతూ డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురంలోని శ్రీనివాస్ నగర్‌కు చెందిన కూకట్‌పల్లి బస్ డిపోలో పనిచేసే ఆర్టీసీ డ్రైవర్ రాజశేఖర్‌రెడ్డి (50) ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో కెపిహెచ్‌బి కాలనీలోని అడ్డగుట్ట వద్ద రన్నింగ్‌లో ఉన్న ఆర్టీసీ బస్సు నుండి కిందికి దిగాడు. దీంతో ప్రమాదవశాత్తు రోడ్డుపై పడడంతో తలకకు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసును కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ పేరు మార్పులో సైబర్ నేరగాళ్ళ నకిలీ ప్రచారం

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలె తెలంగాణ షార్ట్ కట్ పేరును 'టీఎస్' నుంచి 'టీజీ'గా మార్చిన విషయం తెలిసిందే. అయితే దానిని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్ళు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ మార్పు వల్ల భారీగా ప్రభుత్వ ధనం ఖర్చు చేయాల్సి వస్తుందని ఒక నకిలీ నోట్‌ను అంతర్జాలంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వారు రూపొందించిన నకిలీ పోస్ట్‌లో ప్రభుత్వ ధనం రూ.2,767 కోట్లు ఖర్చవుతాయని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయడంతో సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ పేరుతో నకిలీ నోటు సృష్టించినందుకు కేసు నమోదు చేశారు. నిందితులు ఎవరు అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాల ప్రణాళికలో ప్రభుత్వ నకిలీ నోటు ఒక భాగమంటూ, ఏదో కుంభకోణానికి ఇది ఆరంభమని పోలీసు శాఖవారు తెలిపారు. ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దంటూ, ఎవరి దృష్టిలోకైనా 'టీఎస్' 'టీజీ'ల పేర్లతో ఏదైనా ఆన్‌లైన్ వ్యవహారాలు వస్తే, తక్షణమే స్థానిక పోలీసులకు, సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించమన్నారు. ప్రజలను అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు.

# డెంగీ జోరు..ముందస్తు పోరు..



-నగరంలో జూన్‌లోనే విస్తరిస్తున్న వ్యాధి

-ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు

-అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

-యాంటీ డెంగీ మంత్‌గా జులై మాసం

-కార్యాచరణ సిద్ధం చేస్తున్న వైద్య విభాగం

**హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త**

వేసవి ముగిసి ఇలా వర్షాలు పడుతున్నాయో లేదో.. గ్రేటర్ పరిధిలో డెంగి విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమవుతోంది. ప్రతీ ఏడాది మాదిరిగానే వచ్చే జులై నెలను కూడా యాంటీ డెంగీ మంత్‌గా ప్రకటించి అందుకు తగిన కాస్త ముందుగానే కార్యచరణను సిద్ధం చేసుకుంటున్నట్టు జిల్లా వైద్యాధికారి వెంకటి చెప్పారు.

**నగరం... డెంగీకి కేరాఫ్...**

రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే కూడా ఏటేటా అత్యధికంగా హైదరాబాద్ నగరంలోనే డెంగీ కేసులు నమోదవుతాయి. గత 2023లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,756 కేసుల్లో అత్యధికంగా నగరంలోనే నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 307 కేసులు మాత్రమే కాగా ఇటీవల 65 కేసులున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది కూడా అదే సంఖ్య చేరవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ప్రైవేటు ఆసుపత్రులు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, ఫీవర్ ఆస్పత్రి వంటి ఆసుపత్రులతో పాటు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా కేసులు నమోదవుతున్నాయి.

**ఎదుర్కోవడానికి రెడీ...**

సాధారణంగా జులై నెలను డెంగీ ప్రారంభ దశగా దాన్ని డెంగీపై అవగాహన పెంచే మాసంగా అధికారులు చూస్తారు. అది 3 నెలల పాటు దశలవారీగా పెరుగుతూ సెప్టెంబర్ నెలకు అత్యధిక సంఖ్యలో కేసులు వస్తాయి. ఈసారి జూన్‌లోనే ప్రతాపం చూపడం మొదలైంది. కాబట్టి జూన్‌లో కేసులు బాగా పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసి తదితర విభాగాలతో సమన్వయం చేసుకుని డెంగీని ఎదర్కోవాలని జిల్లా వైద్య విభాగం సిద్ధమవుతోంది. వచ్చే నెలలో విస్తృతంగా మెడికల్ క్యాంపులు, ఫీవర్ సర్వేలు ఒక కేసు వస్తే కనీసం 50 కుటుంబాల సర్వే, అవగాహన ర్యాలీలు, సదస్సులు, పాఠశాల విద్యార్థుల కోసం కార్యక్రమాలు, ఫ్రైడే.. డ్రైడే కాన్సెప్ట్‌ను విజయవంతం చేయడం. తదితర అంశాలపై సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. నగరంలో అత్యధిక కేసులు నమోదయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల ప్రత్యేకంగా ముందస్తు చర్యలు చేపట్టనున్నారు.

**ఫీవర్, గాంధీలో రోగుల క్యూ...**

నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి అవుట్ పేషెంట్ విభాగానికి రోగుల క్యూ కట్టారు. నగరంతో పాటు రాష్ట్రంలోని జిల్లాలకు చెందిన రోగులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఓపీ విభాగం కిక్కిరిసింది. రోగుల రద్దీకి అనుగుణంగా ఓపీ కంప్యూటర్ చిట్టీ కౌంటర్లు లేకపోవడంతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే దుస్థితి దాపురించింది.ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు ఉచితంగా అందడంతో ఓపీ రోగుల సంఖ్య క్రమంగా పేరుగుతోందని ఆస్పత్రి పాలనాయంత్రాంగం అధికారి ఒకరు తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో దగ్గు, జలుబు, జ్వరం, వైరల్ ఫీవర్లు వ్యాపించే అవకాశం ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు సూచించారు. ఓపీ విభాగానికి వచ్చే ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందేలా కార్యాచరణ రూపొంది అమలు చేస్తున్నామని వివరించారు.

# నార్సింగిలో వ్యాపారవేత్త కిడ్నాప్ కలకలం

- తెలంగాణ దాటకముందే బాధితుడిని కాపాడిన పోలీసులు
- వ్యాపార లావాదేవీల వల్లనే కిడ్నాప్ చేసినట్లు ఒప్పుకున్న నిందితులు
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు : ఇన్‌స్పెక్టర్

**నార్సింగి, జూన్ 9 ప్రభాతవార్త :**

నార్సింగిలో ఓ వ్యాపరవేత్త కిడ్నాప్ కలకలం రేపింది. వెంటనే నార్సింగి పోలీసులు స్పందించి కిడ్నాపర్ల చెర నుంచి బాధితుడిని కాపాడారు. ఇద్దరు కిడ్నాపర్లను రిమాండ్‌కు తరలించారు. నార్సింగి పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఏసీపీ రమణాగౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా నందికొట్కూరు ప్రాంతానికి చెందిన శేషువర్ధన్‌రెడ్డి(37) బతుకుదెరువు కోసం వలస వచ్చి రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామం ఫోర్ట్‌వ్యూ అపార్టుమెంట్‌లో నివాసముంటూ స్థానికంగా బంగారం, ఎలక్ట్రానిక్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇతడి సహచరులయిన కర్నూలు ప్రాంతానికే చెందిన అండె క్రాంతి కుమార్(36), కెల్లెలు సందీప్(36)లతో శేషురెడ్డికి ఇటీవల వ్యాపారంలో లావాదేవీల వద్ద మనసనపర్ధలు వచ్చాయి. తమకు రావాల్సిన డబ్బులను శేషు నుంచి రాబట్టాలంటే అతడిని బలవంతంగా సొంతూరుకి తీసుకురావాలని కిడ్నాప్ ప్రయత్నం చేశారు. ఈనెల 8.వ,తేదీ రాత్రి 9:20గంటల సమంయలో నార్సింగి వద్ద మారుతీ ఎస్‌క్రాస్(టిఎస్07హెచ్ఎ1221)ను అడ్డగించి అందులో ఉన్న శేషురెడ్డిని బలవంతంగా దించి, తమ బ్రెజ్జాకారు(ఎపి39క్యూటి 9900)లో క్రాంతి, సందీప్‌లు తీసుకెళ్లారు. దీన్ని స్థానికులు గుర్తించి 100కు కాల్ చేశారు. వెంటనే నార్సింగి పోలీసులు స్పందించి బాధితుడి భార్య అరుణను సంప్రదించారు. ఆమె తన భర్తకు ఫోన్ చేయడంతో జరిగిన విషయంను భార్యకు తెలిపాడు. భార్య తన భర్తను క్రాంతి, సందీప్‌లు కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు టోల్‌గేట్‌ల వద్ద విచారించి బ్రెజ్జకారు ఎక్కడి వరకు వెళ్తుంది ఆరా తీసి, మహబూబ్‌నగర్ జిల్లాలోని అడ్డాకుల పోలీసు స్టేషన్ వద్ద పోలీసులు బ్రెజ్జా కారును అడ్డుకొని కిడ్నాపైన శేషును కాపాడారు. పోలీసుల విచారణలో శేషు నుంచి డబ్బులు వసూలు చేసేందుకే అతడిని కిడ్నాప్ చేసుకొని కర్నూలుకు తీసుకెళ్తున్నామని కిడ్నాపర్లు నేరంను అంగీకరించారు. ఇద్దరు కిడ్నాపర్లను రిమాండ్‌కు తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ రమణాగౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, ఎస్.ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నార్సింగిలో వ్యాపారవేత్త కిడ్నాప్ కేసు వివరాలు తెలుపుతున్న ఏసీపీ రమణాగౌడ్

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు : ఇన్‌స్పెక్టర్**

ప్రజలు తమకు జరిగిన అన్యాయంను పోలీసు స్టేషన్‌లలో గాని కోర్టులలో గాని ఫిర్యాదు చేసి న్యాయం జరిగేలా పోరాడాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. భూమి, డబ్బులు, వ్యాపారం, బంగారం, కుటుంబ తగాదాలు ఇలా ఏ విషయాలైనా న్యాయ వ్యవస్థలను సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. తమకు అన్యాయం చేశారని ఇతరులను కిడ్నాప్‌లు చేయడం, భౌతికంగా దాడి చేయడం, హత్యలు చేయడం చట్టరిత్యా నేరమవుతుందని, అందుకు తగిన శిక్షలు అనుభవించాల్సి వస్తుందన్నారు. పౌరులంతా చట్టాన్ని గౌరవించాలని, చట్టాలకు లోబడి నడుచుకోవాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

## కంటోన్మెంట్ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటా
### -ఎమ్మెల్యే శ్రీగణేష్


కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సన్మానిస్తున్న 1వ వార్డులోని పలు వార్డుల అధ్యక్షులు

**కంటోన్మెంట్, జూన్ 9 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో తమను బారీ మెజార్టీతో గెలిపించినందుకు నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా బారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఆదివారం 1వ వార్డులోని పలు కాలనీల అధ్యక్షులు శ్రీగణేష్‌ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జంపన రవిందర్, బల్వంత్ రెడ్డిలతో పాటు పలు కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు. అదే విధంగా 6వ వార్డులో కాంగ్రెస్ నేత గద్దం ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీగణేష్‌ను 6వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నేతలు ఘనంగా సత్కరించారు.

**1001 కొబ్బరి కాయలు కొట్టిన ఎమ్మెల్యే శ్రీగణేష్**

కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ విజయం సాధిస్తే బొల్లారం డౌటన్ బజార్‌లోని భూలక్ష్మి దేవాలయంలో 1001 కొబ్బరి కాయలు కొడుతానని శపదం చేశాడు. గణేష్ విజయం సాధించిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 1001 కొబ్బరి కాయలను ఎమ్మెల్యే శ్రీగణేష్, కాంగ్రెస్ నేత నర్సింహన్‌లు కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

**శ్రీగణేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన నోముల ప్రకాశ్**

కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మారేడ్‌పల్లిలని న్యూ క్లబ్ అధ్యక్షుడు నోముల ప్రకాశ్, బోయిన్‌పల్లి మార్కెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్‌లు ఎమ్మెల్యేకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, క్లబ్ సభ్యులు దిలీప్, సాయికుమార్, లక్ష్మణ్ రావ్, మనోహర్ రెడ్డి, చొల్లేటి రమేశ్, ఫని, సునీల్, రవిందర్ తదితరులు ఉన్నారు.

**ఈటల రాజేందర్‌కు అభినందనలు తెలిపిన కొంతం దీపిక**

**కంటోన్మెంట్, జూన్ 9 ప్రభాతవార్త:** మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీగా ఈటెల రాజేందర్ బారీ మెజార్టీతో విజయం సాధించినందుకు మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంతం నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి అభినందనలు తెలియజేశారు.

**ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి**
**-సిఎంకి తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం విజ్ఞప్తి**


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చీమా శ్రీనివాస్

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:**
గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలలో చేర్చినట్లుగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం హామీని వెంటనే ప్రారంభించాలని, శనివారం వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున హామీని అమలు చేయలేక పోయామని ప్రభుత్వం దాటవేసిందన్నారు. ఎఫ్ఐఆర్ కేసులతో సంబంధం లేకుండా నిజమైన ప్రతి ఉద్యమ కారుడికి హామీలను అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించడానికి ఒక కమిటిని ఏర్పాటు చేసి, ఉద్యమకారులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యమ కారులతోపాటు ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ సురేందర్‌రెడ్డి, కన్వీనర్లు గుండేటి ఐలయ్యయాదవ్, గుర్జని వెంకటేష్ గౌడ్, ఉండాటి లాలయ్య, ఉపాధ్యక్షులు కొంతం వీరాస్వామి, బి.ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం పట్ల హర్షం**

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రజల అశీస్సులతో ముచ్చటగా మూడవసారి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల జాతీయ ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడిశెట్టి పశుపతి హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మంత్రివర్గ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాడిక్కడ జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని మోదీ సరికొత్త నిర్ణయాలను తీసుకుని యువత మరింత అభివృద్ధి చెందటానికి మరింతగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు టి. ప్రతి మ, వీరమల్ల కళ్యాణ్, ఎం.సురేందర్, ఎస్.రమేష్, డి.కె.పాండే, రాజురంజన్ ప్రసాద్, టి.దయాకర్, విజశ్రీ పాల్గొన్నారు.

**జనసేన ఎమ్మెల్యే సత్యనారాయణకు ఘనంగా సత్కారం**


సత్యనారాయణను సత్కరిస్తున్న టి.పద్మారావు

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** ఎపిలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన జి.సత్యనారాయణను ఆదివారం నాడిక్కడ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ), ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేసింది. ఆర్‌పిఐ చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు, స ంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కడారం వినయ్‌కుమార్, కోశాధికారి బాపనపల్లి ప్రమోద్‌కుమార్ తదితరులు సత్యనారాయణను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో సత్యనారాయణ మరిన్ని పదవులను అలంకరించి ప్రజల సంక్షేమానికి అంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాసరి ప్రభు, అప్పల రాజు, వినయ్‌కుమార్, రాజు, ముజీబ్, మోహన్‌కృష్ణ, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

**గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం**

**నేరేడ్‌మెట్, జూన్ 9 ప్రభాతవార్త :** నేరేడ్‌మెట్ పరిధిలోని గంగా చారిటబుల్ ట్రస్ట్ అదినేత బిర్రు బాలమల్లయ్య ఆధ్వర్యంల ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 500 వందల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘసేవకులు సెర్ల అనిల్, బిర్రు హరి, సుందర్, బిర్రు బాలచందర్, బిర్రు విజయ, బిర్రు అరుణ్ పాల్గొన్నారు.

## విద్యార్థిని చదువుకోసం సహృదయం చాటిన కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

**నిజాంపేట్, జూన్ 9, ప్రభాతవార్త**
నిజాంపేట్ 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్2కు చెందిన కృష్ణ, సంగీతల కుమార్తె భూమిక ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతోంది. తమ పాప ఉన్నత చదువు నిమిత్తం తమ ఆర్థికస్థితిని నరసింహా యాదవ్‌తో కలలిసి ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించగా.. కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించి భూమికి ఫీజు నిమిత్తం తనవంతుగా యాభైవేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరాలని, మీకోసం కష్టపడే తల్లిదండ్రులను ప్రేమగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసింహాయాదవ్, శ్రీనివాస్, భూమిక తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థిని భూమికి తల్లిదండ్రులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

**ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలి**
**-ఎమ్మెల్యే పద్మారావు గౌడ్**

**సికింద్రాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** బౌద్ధనగర్‌లోని ఎస్ఆర్‌వీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ప్రత్యేకంగా అస్తమా, ఫల్మనాలజీ విభాగాలకు సంబంధించిన జబ్బులు గుర్తించి ఉచితంగా వైద్యం అందించేందుకు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ వైద్య రంగంలో పేదలకు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తగిన వైద్య సేవలు అందించేందకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యా, వైద్య రంగాలకు తగిన ప్రోత్సాహన్ని అందిస్తున్నామని, వాటిని పేదలకు చేరువలో నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎస్ఆర్‌వీ మల్టీ స్పెషాలిటి క్లినిక్, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రాంచందర్, ప్రముఖ ఫల్మనాలజీ డా. ఎండీ సమీర్ ఆహ్మద్, మేనేజర్ మహ్మద్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

**బస్తీ అభివృద్ధికి పాటుపడతా : పరశురామ్**

**కంటోన్మెంట్, జూన్ 9 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో ఎస్సీ యువజన సంఘం అధ్యక్షులుగా జంగిటి పరశరాములు, ఉపాధ్యక్షులుగా గుర్రపు అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా మారపాక అఖీల్ తేజ, కోశాధికారిగా తాటికాయల జాన్‌లు గత నెల 26న జరిగిన ఎన్నికల్లో విజయం సాధించగా ఆదివారం మారేడ్‌పల్లిలోని జిహెచ్ఎంసి మల్టీపర్‌పస్ ఫంక్షన్ హాల్‌లో అడ్వైజర్ కమిటీ ప్రతినిధులు ఇప్పల రాములు, గొట్టె రమేశ్, తాటికొండరాముల చేత ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కంసాని బాబు, సంఘం సభ్యులు శంకర్, భాస్కర్, తాడూరి అంజయ్య, నర్సింగ్, స్వామి, విల్సన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గ అధ్యక్షులు పరశరామ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా బస్తీ అభివృద్ధి కోసం, దళితుల సంక్షేమం కోసం పాటుపడుతామన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంటుంది**

**హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నప్పుడు విద్యార్థులు ముఖ్యమైన అంశాలను అవగాహన చేసుకుని పఠనం చేస్తే సులువుగా పరీక్షలు పాస్ అవుతారని ప్రముఖ ఉపాధ్యాయులు నూక లింగమూర్తి సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు తరగతుల్లోనే ఉంటుందని, కాలం వృదా చేయకుండా పాఠాలు సక్రమంగా విన్న విద్యార్థులకు మంచి భవిష్యతు ఉంటుందన్నారు. వర్గిల్‌లోని జెడ్‌పిహెచ్ఎస్‌లో 27 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా సేవలు అందించి, పదవి విరమణ చేసిన లింగమూర్తిని ఆదివారం శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోజకులై సమాజాభి వృద్ధికి పాటుపాడాలని, దేశానికి సేవలు అందించాలని సూచించారు. ఉపాధ్యాయుల సేవలను సమాజంలోని ప్రతి ఒక్క రూ గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా నూతి శ్రీకర్‌శర్మ 40 మంది విద్యార్థులు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాటి వెంకటరామయ్య, మని గండ్ల శ్రీనివాస్‌గుప్తా, ఎం.కిష్టయ్య, ఉపాధ్యాయుడు మహి పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం
### -మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

**చార్మినార్, జూన్ 9 ప్రభాతవార్త :** బిజెపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. భారత దేశ ప్రధాన మంత్రిగా మూడవ సారి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం పాతబస్తీ దారుషిఫాలో చార్మినార్ నియోజకవర్గం బిజెపి నాయకులు కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం బిజెపి నాయకులు ప్రవీణ్ కుమార్, మహ్మద్ వసీముద్దీన్, దిగ్విజయ్ జైన్, నవాబ్ సఫత్ అలీ ఖాన్, దియానత్ అలీ ఖాన్, ప్రదీప్ జైశ్వాల్, మహ్మద్ హాసింతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి సమావేశం


సమావేశంలో పాల్గొన్న భాగ్యనగర్ శ్రీ మహాకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు

**చార్మినార్, జూన్ 9 ప్రభాతవార్త :** భాగ్యనగర్ శ్రీ మహాకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి సర్వసభ్య సమావేశం పాతబస్తీ మీరాలంమండిలోని శ్రీ మహంకాళేశ్వర మందిరంలో కమిటి అధ్యక్షులు గాజుల అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భాగ్యనగర్ శ్రీమహాకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షులు గాజుల అంజయ్య మాట్లాడుతూ బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభానికి ముందే పాతబస్తీలో అభివృద్ధి పనులు జరిగేలా అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. పాతబస్తీలోని దేవాలయాల కమిటి ప్రతినిధులు దేవాలయాల వద్ద చేపట్టవలసిన అభివృద్ధి పనుల వివరాలు తనకు అందజేస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలియజేశారు. పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు అత్యంతవైభవంగా నిర్వహించటానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ శ్రీ మహాకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు సదానంద్ యాదవ్, మధుసూధన్ యాదవ్, హంసరాజ్, మధుసూధన్ గౌడ్, మాణిక్ ప్రభు గౌడ్‌లు పాల్గొన్నారు

# కన్నులపండువగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు

**నవరసభరిత పదవిన్యాసం నాట్యం : డా. ఎం.కె.రాము**

**నాంపల్లి, జూన్ 9 ప్రభాతవార్త :**
భారతీయ శాస్త్రీయ, సంప్రదాయ, జానపద కళల్లోని సంగీతం, నృత్యకళలను పిల్లలతో నిర్వహించడం చాలా ఇష్టమని వారి నవరసభరిత పదవిన్యాసం నాట్యం అభినయభాష్యమని చమత్కరించారు. పిల్లలు మన కళలను భావితరాలకు అందించాలని కోరుతూ ముందుగా తల్లిదండ్రులు వారికి నేర్పించాలన్నారు. ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థలు శ్రీ మహతి అకాడమీ, తెలంగాణ కళాజాగృతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బొగ్గులకుంట తిలక్‌నగర్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను పురస్కారించుకొని ఆయా సంస్థల శిష్యబృందంచే ప్రదర్శింపబడిన సాంస్కృతిక సంబూరాల సరాగాలు సుమధురంగా సాగి అంబరాన్నంటి విచ్చేసిన అశేష కళాప్రియులను ఉత్తేజపరిచి ఉర్రూతలూగించాయి. కళాభారతి ఎస్పీ భారతి సభాధ్యక్షతన జరిగిన సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభుత్వ జవహర్ బాలభవన్ పూర్వ డైరెక్టర్ డా. ఎం.కె.రాము


రేలంగి నరసింహారావును సత్కరిస్తున్న ఎం.కె.రాము, చాడ వెంకటరెడ్డి, పద్మావెంకటేష్, భారతి తదితర అతిథులు

విశిష్ట అతిథులు ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, సివిపి.అంజనీకుమారి, ఎం.గోపి, సిపిఐ చాడ వెంకటరెడ్డి, పల్లె నర్సింహ, సురేందర్, నిర్వాహకుడు పద్మావెంకటేష్ తదితరులతో కలిసి కళాకారులను, గురువులను, పలువురు ప్రముఖులను తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో ఘనంగా సత్కరించారు.

## తన్మయుల్ని చేసిన సంస్కృతీ కళారాధన


సత్కారగ్రహీతలతో అతిథులు సురేష్, గిరిధర్, కళ్యాణ్‌శాస్త్రి తదితరులు

**నాంపల్లి, జూన్ 9 ప్రభాతవార్త :**
ప్రముఖ సాంస్కృతిక సేవాసంస్థ సంస్కృతీ సర్వీసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆదివారం ఉదయం సంస్థ అధ్యక్షులు డా. అరిపిరాల కళ్యాణ్‌శాస్త్రి నేతృత్వంలో రెండు గంటలపాటు నిర్విరామంగా సాగిన సంస్కృతీ కళారాధన కనువిందుగా సాగింది. 120మందికి పైగా చిన్నారి యువ కళాకారులు శాస్త్రీయ, సంప్రదాయ, జానపద నృత్యాలను పలు కీర్తనలు, అంశాలతో అత్యంత అద్భుతంగా ప్రదర్శించి ఆహుతుల ప్రశంసలందుకొని తన్మయుల్నిచేసి సంగీతలోకంలో ఓలలాడించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు నటులు జెమినీ సురేష్, వెంకట గిరిధర్, నటి గీతాసింగ్, అనుపమా తదితరులు అద్భుత నాట్యప్రదర్శన కావించిన కళాకారులను కళాశ్రీ, వాద్యశ్రీ, స్వరశ్రీ, కళావిశారద బిరుదులతోపాటు ప్రశంసాపత్రాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

**ప్రఖ్యాత గేయరచయిత వడ్డేపల్లికృష్ణకు ఆటా ఆత్మీయ పురస్కారం**

**రవీంద్రభారతి, జూన్ 9 ప్రభాతవార్త :** జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్, అట్లాంటా, జార్జియా అమెరికాలోని అమెరికా తెలుగు సంఘం ఆటా ఆధ్వర్యంలో ఆటా బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ప్రెసిడెంట్ మధు బొమ్మినేని నేతృత్వంలో జూన్ 7నుండి 9వరకు మూడురోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న 18వ ఆటా మహాసభలు నిర్వహిస్తున్న విషయం మా పాఠకులకు తెలిసిందే. ఇందులో భాగంగా ఈరోజు ఆదివారం రవి నీరెల్లి, అఫ్సర్ ఆధ్వర్యం నిర్వహించిన ఆటా సాహిత్య సదస్సులో ప్రఖ్యాత గేయరచయిత, కవి డా. వడ్డేపల్లి కృష్ణను ఘనంగా సత్కరించి ప్రతిష్ఠాత్మక ఆటా ఆత్మీయ పురస్కారం, జ్ఞాపికను ప్రదానం చేశారు. అంబికా అనంత్, సాయి లక్కరాజు తదితరులు పాల్గొన్న ఈ సదస్సులో డా. వడ్డేపల్లి కృష్ణ సినీగీతాలు, లలితగీతాల గురించి సోదాహరణగా ప్రసంగించి అందరి ప్రశంసలందుకున్నారు.

**సిసిరోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్**

**తార్నాక, జూన్ 9 ప్రభాతవార్త :** నూతనంగా రూ. 54లక్షల వ్యయంతో నాచారంలో వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పరిశీలించారు. నాచారం జాన్సన్ గ్రామర్ హైస్కూల్ వైపు వెళ్లే రోడ్డు నిర్మాణం పనులు కొన్ని అనివార్యకారణాల వల్ల వేయడంలో ఆలస్యం అయిందని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఇప్పటికే రాఘవేంద్రనగర్ చుట్టుపక్కల అన్ని కాలనీల్లో సీసీ రోడ్డు వేయిస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ చెప్పారు. పనుల్లో నాణ్యతప్రమాణాలు పాటించేలా అధికారులతోల కలిసి తరుచు పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిజన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, కట్టబుచ్చన్న గౌడ్, శ్రీను నాయక్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**26న ఘనంగా ఐఎన్‌టియుసి 75వ వసంతాల వేడుక**

**బేగంబజార్, జూన్9ప్రభాతవార్త:** జాతీయ ఐఎన్‌టియుసి అధ్యక్షులు మాజీ రాజ్యసభసభ్యులు డాక్టర్ జి.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఐఎన్‌టియుసి జాతీయ 75వ వసంతాల వేడుకలను ఘనంగా జరుపుకొనున్నట్లు ఐఎన్‌టియుసి వర్కింగ్ అధ్యక్షులు, మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ నాయకులు అదిల్‌షరీఫ్ తెలిపారు. ఈ వేడుకలను ఈనెల26వ తేదిన జరిగే వేడుకలకు తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ విచ్చేయనున్నట్లు తెలిపారు. మంత్రిన్ని శాలువకప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలోఐఎన్‌టియుసి నాయకులు జనక్‌ప్రసాద్, ఆర్‌డి. చంద్రశేఖర్, విజయ్‌కుమార్ యాదవ్, కె.శివకుమార్, జయప్రకాష్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ దశాబ్ది ఏడాది పొడవునా జరగాలి**
**-విశ్రాంత జడ్జ్ బూర్గుల మధుసూదన్**

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ది పూర్తయిన సందర్భంగా ఏడాది అంతా కార్యక్రమాలు జరగాలని విశ్రాంజ న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమి అధినేత విక్కి మాస్టర్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువు సునీతారాణి శిష్య బృందం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా 'జానపద శాస్త్రీయ నృత్య' ప్రదర్శనలు అందరిని అలరించింది. ఈ సందర్భంగా అతిథులుగా విశ్రాంత జడ్జ్ బూర్గుల మధుసూదన్, బిఆర్ఎస్ నేత నాగేష్‌ముదిరాజ్ తదితరులు హాజరై నృత్యకళాకారులను సత్కరించి అభినందించారు. సంస్థ వ్యవస్థాపకులు విక్కి మాస్టర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని కళలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బాలనర్తకి తోకల సాయి సుప్రీతిలకు నాట్యమయూరి అవార్డును అందించి అభినందించారు.

**ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక వేడుకలు**

**యూసుఫ్‌గూడ, జూన్ 9, ప్రభాతవార్త :** శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం వేడుకలను అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ చౌరాస్తాలో నియోజకవర్గం కాన్సిట్యూయెన్సీ హిందువాహిని బాగ్ కన్వీనర్ సిహెచ్ శ్రీనువాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో డివిజన్ నాయకులు సిహెచ్ వెంకటరామిరెడ్డి, బాగ్ కోకన్వీనర్ వంశీకృష్ణ, రామ్‌గోపాల్ సింగ్, జి.రాజు, పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్, జి.సుదర్శన్, లాల్‌సింగ్, గంగాధర్, రాకేష్ యాదవ్, జీతు, సందీప్‌నాయక్, నవీన్, వెంకటరెడ్డి, మురళీమోహన్, అంకిత్ సింగ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో లారీ డ్రైవర్ హత్య

**అత్తాపూర్ జూన్9, ప్రభాతవార్త :** మద్యం మత్తులో లారీ డ్రైవర్‌ని తోటి స్నేహితులు దారుణంగా హత్య చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్‌పెక్టర్ వెంకటరామిరెడ్డి వివరాల ప్రకారం...అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని సులేమాన్ నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ లాయిక్(30)ను శనివారం అర్ధరాత్రి ముగ్గురు స్నేహితులు అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 258 వద్దకు మద్యం తాగేందుకు తీసుకెళ్లారు. అక్కడ ఏం జరిగిందో ఏమో కాని మద్య సీసాలు పగలగొట్టి అతని గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. యువకుడి హత్యతో ఒక్కసారిగా కలకలం రేగింది. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## ప్రధానిగా మూడోసారిగా ఎన్నికైన మోదీకి అభినందనలు

**-ఇప్పటికైనా బిసిల డిమాండ్లు అమలు చేయాలి**
**-రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:**
ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ మూడోవసారి ఎన్నికైనందుకు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అభినందనలు తెలియజేశారు. గత పది సంవత్సరాలుగా బిజెపి పాలనలో బిసిలకు ఏ ఒక్క చిన్న పథకం కూడా కల్పించలేదని, ఈ దఫా ఎన్నికల్లో బిసిలు ఆగ్రహంతో వాత పెట్టారని ఇప్పటికైనా బిసిల ఆగ్రహాన్ని గుర్తించి బిసిలకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే జాతీయ స్థాయిలో విద్యార్థులకు పూర్తి ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం-స్కాలర్‌షిప్‌ల పథకం ప్రవేశపెట్టాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రతి బిసి, ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి 20 లక్షలు ఆర్థిక సహాయం అందించి అభివృద్ధి చేయాలని ఆదివారం నాడిక్కడ పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ బిసి సామాజిక వర్గానికి చెందినవారై ఉండి కూడా బిసిల అభివృద్ధికి ఒక్క చిన్న పథకం కూడా ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొనకపోవడంతో దేశంలోని 70 కోట్ల మంది బిసిలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 76 సంవత్సరాల తరువాత 70 కోట్ల మంది బిసి ప్రజలకు వాటా ఇవ్వారా ?, ఇది ప్రజాస్వామ్య దేశమని, బిసిలు బిచ్చగాళ్ళు కాదని, వాటాదారులని, వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు చేస్తారని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఇప్పటికైనా బిసి విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం, స్కాలర్‌షిప్‌ల పథకం అమలు చేస్తామని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బిసిల అభివృద్ధికి బడ్జెట్‌లో రెండు లక్షల కోట్లు కేటాయిస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

## చేతుల్లో ఆరోగ్య పుస్తకం ప్రతి ఇంట్లో ఉండాలి : డాక్టర్ రాజారెడ్డి

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** మానవ జీవిత కాలం పెరుగుతున్న క్రమంలో, ఎదురవుతున్న అనేక దీర్ఘకాలిక జబ్బులపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని నిజామ్ ఇన్సిటీట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ ప్రతిభాలక్ష్మి రచించిన 'చేత(తు)ల్లో ఆరోగ్యం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రోజు 19 మంది రోడ్డు ప్రమాదాలు బారినపడి మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవ జీవితకాలం పెరుగుతున్న క్రమంలో ఎదురవుతున్న అనేక దీర్ఘకాలిక జబ్బుల గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. తెలంగాణ ఆయుష్ మాజీ అదనపు సంచాలకులు డాక్టర్ విజయలక్ష్మి మా


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజారెడ్డి

ట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం గురించి ఉండే అనేక సందేహాలకు, వైద్యులు అందించవలసిన సలహాలు ఇందులో ఉన్నాయన్నారు. పుస్తక రచయిత డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవడం, మన ఆరోగ్యం బాధ్యత తీసుకోవడం వల్ల మన చేతల్లోనే (మన చేతుల్లోనే) మన ఆరోగ్యం ఉంటుందని తెలియజేసే ప్రయత్నమే ఈ పుస్తకం అని అన్నారు. కార్యక్రమంలో నిమ్స్, గాంధీ ఆసుపత్రికి చెందదిన వైద్యులు, దాదాపు వంద మంది ఆరరోగ్యాభిలాషులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పెరిక కుల సంఘాన్ని మరింత బలోపేతం చేస్తాం


జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగయ్య, చిత్రంలో సుంకరి ఆనంద్ తదితరులు

**-రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగయ్య**

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెరిక కుల సంఘాన్ని మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగయ్య అన్నారు. ఆదివారం బాగ్‌లింంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో 25వ ప్రపంచ పెరిక కుల వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమం కన్వీనర్ సుంకరి ఆనంద్ పర్యవేక్షణలో జరిగింది. మద్దా లింగయ్య, సుంకరి ఆనంద్ మాట్లాడుతూ పెరిక కులస్తులు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. సుమారు 55 జంటలకు అక్కడికక్కడే వివాహ కుదిరినట్లు నిర్వాహకులు తెలిపారు. సుంకరి ఆనంద్ మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా పెరిక కుల వేదికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇలాంటి వేదికలను కులస్తులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపు 300 మందికిపైగా పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ ఆత్మగౌరవ కమిటీ చైర్మన్ గటిక విజయకుమార్, తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం ప్రధాన కార్యదర్శి భూస్వామి శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బత్తిని పరమేష్, చండిక కిషోర్, మనోహర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రపంచ పెరిక కుల వధూవరుల వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది.

# జాతీయ క్రీడలలో మర్రి లక్ష్మారెడ్డి విజయం

**-రెండు స్వర్ణాలు గెలిచిన హైదరాబాద్ వెటరన్ ఎథ్లెట్**




**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:**
జాతీయ స్థాయి స్పోర్ట్స్‌లో విజయం సాధించిన హైదరాబాద్ వెటరన్ ఎథ్లెట్, ఎమ్.ఎల్.ఆర్ ఐటీ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మా రెడ్డి(77) నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని మల్కాజ్ గిరి శాశన సభ్యులు మర్రి రాజశేఖర రెడ్డి కొనియాడారు. ఈ నెల 7,8,9వ తేదీలలో గుజరాత్‌లో జరుగుతున్న మాస్టర్స్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఈత పోటీల్లో 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లోని 3 నిమిషాల 32 సెకెన్లలో రేసును పూర్తి చేసి అగ్రస్థానం దక్కించుకున్నారు. అలాగే 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో కూడా ప్రథమ స్థానం కైవశం చేసుకున్నారు. 4 నిమిషాల 16 సెకెన్లలో రేసును ముగించేశారు. నిత్యం క్రీడలలో చురుగ్గా పాల్గొనే మర్రి లక్ష్మారెడ్డి సైక్లింగ్, స్విమ్మింగ్, రన్నింగ్‌లో నిష్ణాతులనే విషయం తెలిసిందే. వ్యాయామం పట్ల తీక్షణమైన శ్రద్ధ కనబరుస్తారని ఆయనకి పేరుంది. ఈ నేపథ్యంలో గుజరాత్‌లో జరిగిన క్రీడా పోటీలలో మొదటి స్థానంలో నిలిచి రెండు స్వర్ణ పతాకాలను కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర రెడ్డి, ఎమ్.ఎల్.ఆర్.ఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు ఆయనకు అభినందనలు తెలిపారు.

## మోదీ, చంద్రబాబుల ప్రమాణ స్వీకారం దళితులకు చీకటి రోజు

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:**
నరేంద్రమోదీ ప్రధానిగా, చంద్రబాబునాయుడు ఎపి సిఎంగా ప్రమాణస్వీకారం చేయడం దళిత బహుజన జాతులకు చీకటి రోజులని (బ్లాక్ డే) దళిత బహుజన పార్టీ జాతీయ (డిబిపి) అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ చెప్పారు. దేశంలో ఆప్రజాస్వామిక, నియంతృత్వ, అరాచక, హంతక పాలన చేసిన నరేంద్రమోదీ నాయకత్వంలో బిజెపి మూడోసారి కేంద్రంలో ప్రభుత్వంను ఏర్పాటు చేయడం నిమ్న జాతుల భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన దేశ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తామని మోదీ ఎన్నికల ముందు ప్రకటించి నేడు రాష్ట్రపతి భవన్‌లో ఆదే రాజ్యాంగంపై ప్రమాణస్వీకారం చేయడమంటే రాజ్యాంగ గోప్యతనమని ఆయన తెలిపారు. గతంలో వీరి పాలనలో దళిత బహుజన జాతులకు తీరని అన్యాయం జరిగిందని, ప్రస్తుతం ఈ జాతుల జీవస మానవ హక్కులు కాలరాసే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగ హక్కులు, రక్షణ చట్టాల కోసం మోదీ సర్కార్‌పై పోరాటాలకు సిద్దం కావాలన్నారు. ఎపిలో ఎన్‌డిఎ కూటమి టిడిపి, జనసేన, బిజెపి ఎన్నికల్లో గెలుపొందడం అంతా ఈవిఎం ట్యాంపరింగ్ మాయాజాలమన్నారు.

మోదీ కేంద్ర ఎన్నికల కమిషన్ అండదండ లతో ఎన్‌డిఎ కూటమి ఈవిఎంలను రిమోట్ హ్యాకింగ్ ద్వారా ట్యాంపరింగ్ చేసి గెలిచినట్లు ప్రకటించుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలో ఈ నెల 12న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంను ఏర్పాటు చేస్తూ ప్రమాణ స్వీకారం చేయడం దళిత బహుజన జాతులకు దుద్దినమని ఆయన ఎద్దేవ చేశారు. ఈ మనువాదుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించాలని కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు.



సమావేశమైన పూర్వవిద్యార్థులు

## దౌల్తాబాద్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**హత్నూర జూన్ 9,ప్రభాతవార్త:** హత్నూర మండలం దౌల్తాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 2007. 2008విద్యాసంవత్సరానికి సంబంధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమ్మేళన సమావేశాన్ని స్థానికంగా ఉన్న ప్రైవేటు పంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఆపాయ్యంగా పలకరించుకుంటూ,పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదువులను భోదించిన ఉపాధ్యాయులు అంజయ్య,వెంకట కృష్ణయ్య,నరసింహశర్మ,రఘునాథ్‌రెడ్డి,దాయనందరెడ్డి,లీలావతి పల్‌లను శిశ్యులు, గురువులను పూలమాలు,శాలువాలతో సన్మానించారు.

## శాంతియుత వాతవరణంలో ముగిసిన గ్రూప్1 పరీక్షలు

**హత్నూర జూన్ 9,ప్రభాతవార్త:** ఆదివారం జరిగిన గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించి హత్నూర మండలంలోని నిర్వహించిన రెండు కేంద్రాలలో శాంతయుత వాతవరణంలో జరిగాయి. హత్నూర మండలంలోని తుర్కలఖనాపూర్ గ్రామపరిధిలోని రత్నపురి కళాశాలతోపాటు చింతల్‌చెరువులోని కార్మేల్ పాఠశాలలో గ్రూప్1 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.కార్మేల్ పాఠశాలలో 504 మంది అభ్యర్థులు, రత్నపురు కళాశాలలో 696మంది అభ్యర్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేశారు.పరీక్షల నిర్వాహణ కార్మేల్ పాఠశాల బందోబస్తును బొల్లారం సి.ఐ.గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, రత్నపురి కళాశాల బందోబస్తును జిన్నారం సి.ఐ.సుధీర్‌కుమార్,హత్నూర ఎస్.ఐ.సుభాష్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.పరీక్షకేంద్రాల నిర్వాహణను పటాన్‌చెరు డీఎస్పీ పి.రవిందర్‌రెడ్డి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

## ప్రమాదకరంగా అల్లాదుర్గం ఐబి చౌరస్తా


ప్రమాదకరంగా ఐబి చౌరస్తా

**అల్లాదుర్గం, జూన్ 9, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని ఐబి చౌరస్తా ప్రమాదకరంగా మారింది. చౌరస్తా వద్ద మూల మలుపు ఉండటంతో అటుగుండా వెళ్లే వాహనాలు తరుచూ ప్రమాదానికి గురవుతున్నాయి. అల్లాదుర్గం చౌరస్తా గుండానే వట్‌పల్లి, జహీరాబాద్, కర్ణాటకలోని బీదర్ పట్టణాలకు వాహనాలు నిత్యం వందల సంఖ్యలో తిరగాడుతుంటాయి. చౌరస్తా వద్ద మూల మలుపు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కానరాకపోతుండటంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనడం, వాహనాల చోదకులు క్షతగాత్రులు కావడం సర్వసాదారంగా మారిందని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీలు అధిక లోడ్‌తో అతివేగంగా నిర్లక్ష్యంగా దూసుకువస్తుండటం కూడా ప్రమాదాలకు కారణమని చెప్పవచ్చు. విద్యార్థులు విద్యను అందుకునేందుకు ఈ చౌరస్తా గుండానే విద్యాలయాలకు వెళ్లాల్సి ఉండటంతో తల్లిదండ్రులు భయం గుప్పిట్లో తమ చిన్నారులను విద్యను ఆర్జించేందుకు పంపుతున్నారు. మూల మలుపు వద్ద ఎలాంటి సూచకలు సైతం ఏర్పాటు చేయకపోవడం అధికారుల పనితీరును చాటుతోంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చౌరస్తా వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రజలు సూచిస్తున్నారు.

## బండి సంజయ్, కిషన్‌రెడ్డిలను సన్మానించిన బిజెపి నాయకులు

**బెజ్జంకి, జూన్ 9, ప్రభాతవార్త:** కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి రెండో సారి ఎంపిగా గెలుపొందిన బండి సంజయ్, సికింద్రాబాద్ నుంచి రెండో సారి ఎంపిగా గెలుపొందిన కిషన్‌రెడ్డిలకు బిజెపి అధిష్ఠానం కేంద్ర మంత్రి వర్గంలో చోటు కల్పించడంతో ఆదివారం ఢిల్లీలోని బిజెపి కార్యాయలంలో బండి సంజయ్, కిషన్‌రెడ్డిలను రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంజయ్, కిషన్‌రెడ్డిలను ఎంపిలుగా గెలిపించిన అయా పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు అయన కృతజ్ఞతలు తెలిపారు.

## కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం : ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, జూన్9 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఎన్ఆర్ఐ ఆనంద్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ శర వేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్‌ను అభినందించారు. అనంతరం బీరంగూడలోని గోశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లలనందరిని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి

### చిన్నచింతకుంట పాఠశాల ప్రధానోపాధ్యాయుల నాగూల్‌మీరా

**నర్సాపూర్ జూన్ 9. ప్రభాతవార్త :** తమ పిల్లలనందరిని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి చదివించాలని చిన్నచింతకుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల నాగూల్‌మీరా అన్నారు. మండల పరిధిలోనిచిన్నచింతకుంట గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో బాగంగా గ్రామంలో ఇంటింటికి సర్వేనిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయులు నాగూల్‌మీరా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లు, యూనిపామ్స్‌లు, మధ్యాహ్న బోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. అంతేగాక ఇంగ్లీష్ మాధ్యమం ప్రవేశ పెట్టిన కారణంగా తమ పిల్లనందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అదేవిదంగా గ్రామంలో ఎవ్వరు బడిబయట పిల్లలు ఉండకూడదని తెలిపారు. ఈమేరకు గ్రామస్తులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయులు నాగూల్‌మీరా, ఉపాధ్యాయులు రాజు, రంజిత్, గ్రామ పంచాయతీ సెక్రటరి లక్ష్మణ్ విద్యార్థుల తల్లిదండ్రులు విఠల్,సీతయ్య, శేఖర్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.


చిన్నచింతకుంటలో బడిబాట కార్యక్రమంలో బాగంగా ఇంటింటకి తిరిగి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం తో పాటు ఉపాధ్యాయులు తదితరులు

## దేవాలయాల అభివృద్ధికి మోహన్‌రెడ్డి సేవలు మరువలేనివి

**రామాయంపేట, జూన్ 9, ప్రభాతవార్త :** తన సర్వీసు కాలంలో ఈవో మోహన్‌రెడ్డి దేవాలయ అభివృద్ధి కోసం చేసిన సేవలు మరువలేనివని రామాయంపేట మహంకాళి దేవాలయం ఎఫ్‌టీ చైర్మెన్ సరాఫ్ పాండురంగాచారి కొనియాడారు. ఆదివారం నాడు రామాయంపేట పట్టణంలోని మెహెర్‌సాయి ఫంక్షన్‌హాల్‌లో స్థానిక మహంకాళి దేవాలయం ఈవో మోహన్‌రెడ్డి పదవి విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోహన్‌రెడ్డి హయంలో అవినీతికి తావులేకుండా పనిచేశారని, ఎన్నో దేవాలయాలు ఆయన హయంలో అభివృద్ధి చెందాయని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగు లకు పదవివిరమణ తప్పనిసరనీ తెలిపారు. వీలైనంతలో ప్రతి ఒక్కరు సమాజ శ్రేయస్సు కోసం, సమాజంలో ఉననన చెడును నిర్మూలించడం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలువురు వ్యాపారస్తులు, ఉద్యోగులు వివిధ వర్గాల ప్రజలు మోహన్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎంపీపీ సరాఫ్ మోహన్‌చారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.రమేష్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకుడు నవాత్ రాజేందర్‌ప్రసాద్, వ్యాపారస్థులు డిబిఆర్ శంకరయ్య, ఎనిశెట్టి అశోక్, సంతోష్, చింతరాజు, దేవస్థానం పాలకమండలి సభ్యులు మర్కు దత్తు సగర, బసన్నపల్లి రాజు యాదవ్, ఎర్రం అంజనేయులు, మాజీ సభ్యులు దోమకొండ యాదగిరి, కాంగ్రెస్ నాయకులు పిట్ల ప్రకాష్ పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సుకు ఆధాత్మిక సేవలు అవసరం

### పద్మిని దామోదర్ రాజనర్సింహా

**సంగారెడ్డి టౌన్, జూన్ 9, ప్రభాతవార్త:** సమాజ శ్రేయస్సు కొరకు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు అవసరమని పద్మిని దామోదర్ రాజనర్సింహా అన్నారు. ఆదివారం సంగారెడ్డిలో ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో సంగారెడ్డి శ్రీ పరం జ్యోతి అమ్మ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన శ్రీ కల్కి అమ్మా భగవాన్ కళ్యాణ వేడుకలకు పద్మిని దామోదర్ రాజనర్సింహా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి జిల్లాలోని ఆయా మండలాలతో పాటు హైద్రాబాద్, రంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సేవా సమితి నిర్వాహకులు న్యాయవాది కాలివేముల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకుంటున్నారన్నారు.


సంగారెడ్డిలో శ్రీ కల్కి అమ్మా భగవాన్ కళ్యాణ వేడుకల్లో మాట్లాడుతున్న పద్మిని దామోదర్ రాజనర్సింహా

కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు తూర్పు నిర్మల జగ్గారెడ్డి, కౌన్సిలర్ కొన సంతోష్ కుమార్, అనిల్, కొండల్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండోతో మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుంది

**సిద్దిపేట రూరల్, జూన్ 9, ప్రభాతవార్త :** తైకా ్వండో నేర్చుకోవడం వలన మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని జిల్లా తైకా ్వండో గౌరవాధ్యక్షులు వేలేటి రాధాకృష్ణ శర్మ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో తైక్వాండో అధ్వర్యంలో అదివారం నిర్వహించిన తైకా ్వం డో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలుపొందిన తైక్వాండో విద్యార్థులకు బెల్టులు, ధృవీకరణ పత్రాలు జిల్లా తైకా ్వండో గౌరవాధ్యక్షులు వేలేటీ రాధాకృష్ణశర్మ, తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ పి.రాంమోహన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా తైక్వాండో జిల్లా గౌరవాధ్యక్షులు రాధకృష్ణ శర్మ మాట్లాడుతూ శారీరక ధృడత్వం అలోచన శక్తి పెరుగడంతో పాటు అత్మ రక్షణకు, అత్మ ధైర్యానికి తోడ్పడుతుం దన్నారు. ప్రతి ఒక్కరూ తైక్వాండో నేర్చుకోవాలన్నారు.

ఉపాధ్య క్షులు డా॥పి.రాంమోహన్ మాట్లాడుతూ తైకా ్వండో నేర్చుకోవడం ద్వారా క్రమశిక్షణ, ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందన్నారు.

తైక్వాండో నేర్చుకోవడంతో విద్యా, ఉద్యోగాలలో 2 శాతం స్పోర్ట్స్ కూడా లభిస్తుందన్నారు. సిద్దిపేట తైక్వాండో విద్యార్థులు రా ష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. జిల్లా తైకా ్వండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

## ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి : పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

**సంగారెడ్డి టౌన్, జూన్ 9, ప్రభాతవార్త:** అక్రమ దందాకు పాల్పడుతున్న ప్రయివేటు పాఠశాలలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం సురేష్, నరసింహారెడ్డిలు అన్నారు. ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం సురేష్, నరసింహారెడ్డిలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల నుంచి విచ్చల విడిగా ఫీజులను వసూలు చేస్తూ పాఠ్యపుస్తకాలను, యూనిఫాంలను, బై బెల్టులను అడ్మిషన్ ఫీజుల పేరుతో ముక్కు పిండి వసూలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా వసూలు చేస్తున్న ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గంజి హర్షిత్, జిల్లా నాయకులు అర్జున్, శ్రీనిధి, అర్చన, ఆనంద్, నవీన్, రమేష్, ప్రియ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా పంచాయితీ భవనం

**సిర్గాపూర్, జూన్ 9, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో కొత్తగా నిర్మించిన పంచాయితీ భవనం నిరుపయోగంగా మారింది. గ్రామంలోని పాత పంచాయితీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త పంచాయితీ భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజిఎస్ పథకంలో 15లక్షల రూపాయలు మంజూరు కాగా కొత్త భవనాన్ని నిర్మించారు. గత సంవత్సరం జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ళ సంజీవరెడ్డిలు కొత్త భవనినికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. 15 లక్షలు వెచ్చించి నిర్మించిన కొత్త భవనంలో పంచాయితీ కార్యకలాపాలు మాత్రం నేటికి ఆరంభం కాలేదు. పాత భవనంలోనే పంచాయితీ పనులు నిర్వహిస్తుండటంతో కొత్త భవనం అలంకార గ్రామంలో అలంకార ప్రాయంగా మారింది.

## జెన్‌టియులో గ్రూప్-1 పరీక్ష-పోలీసుల నిఘా


జెఎన్‌టియు వద్ద భద్రత నిర్వహిస్తున్న పోలీసులు

**చౌటకూరు, జూన్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జెఎన్‌టియూలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. పరీక్ష కేంద్రాన్ని సిఐ అనిల్ కుమార్ గౌడ్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తన సిబ్బందితో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. శివంపేట వద్ద ఉనన పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్ష కేంద్రాన్ని సైతం సిఐ అనిల్‌కుమార్ గౌడ్ పరిశీలించరు. సిఐ వెంట ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చేర్యాల,జూన్ 9, ప్రభాతవార్త** చేర్యాల పట్టణంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో 1997-98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక శివజ్యోతి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.సుమారు రెండు దశాబ్దాల తరువాత కలుసుకోవడంతో ఆనందోత్సవాల మధ్య ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు.దేశ విదేశాలలో సైతం స్థిరపడినవారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.పూర్వ విద్యార్థులు దాసరి సమ్మయ్య,ఆడేపు శ్రీనివాస్,సతీష్, అమరేందర్, శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కుమార్, రమేష్,కరుణాకర్,మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం మరింత బలోపేతం

### బిజెపి రాష్ట్ర నాయకుడు నవాత్ రాజేంద్రప్రసాద్

**రామాయంపేట, జూన్ 9, ప్రభాతవార్త :** నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి దేశ ప్రధానమంత్రి కావడంతో భారతదేశం మరింత బలోపేత దేశంగా అవతరించబోతున్నట్లు బిజెపి రాష్ట్ర నాయకుడు నవాత్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. భారతదేశ ప్రజలు నమ్మకంతో మూడోసారి తమ పార్టీకి ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని తమపార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ముచేయబోదని తెలిపారు. ఎన్నికలకు ముందు బిజెపి ప్రకటించిన మేనిఫెస్టోలో ఉన్న హామీలన్నింటిని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమలు చేస్తారని అదేవిధంగా మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గంలో రఘునందన్‌రావును ప్రజలు పెద్ద మెజార్టీతో గెలిపించారని, భవిష్యత్తులో పార్లమెంటరీ నియోజకవర్గం ప్రగతి పథంలో పయనిస్తుందని తెలిపారు. రఘునందన్‌రావు గెలుపుకోసం కార్యకర్తలందరూ సమిష్టిగా కృషి చేశారని తెలిపారు. అందుకే రామాయంపేట పట్టణంలో బిజెపికి ఓట్లు ఎక్కువ శాతం వచ్చాయని గుర్తు చేశారు. అంతే తప్ప ఏ ఒక్కరి కారణం గానో రాలేదని ఆయన స్పష్టం చేశారు.

## దళిత హక్కుల శిక్షణ తరగతులను జయపద్రం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**చేర్యాల,జూన్ 9, ప్రభాతవార్త** ఈనెల 18నుండి20వ తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సా ్థయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రామగల్ల నరేష్ కోరారు.ఆదివారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద కార్యాక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి ఐదు వందల మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు గూడెపు సుదర్శన్,రామగళ్ళ కిషోర్,కాటం శ్రీకాంత్, మళ్ళిగారి భూమయ్య,క్రాంతి కుమార్,గజ్జల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**చేర్యాల,జూన్ 9, ప్రభాతవార్త** తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు అందె అశోక్,అంబటి అంజయ్యగౌడ్ కోరారు.ఆదివారం పట్టణకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో తెలంగాణ ఉద్యమకారులను ఏనాడు పట్టించుకోలేదని అన్నారు.కేసిఆర్ నియంత అరాచక పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని తీసుకురావడానికి తెలంగాణ ఉద్యమకారులు కీలకపాత్ర పోషించారన్నారు.ఇప్పటికైన ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు.సమావేశంలో నాయకులు ఉద్యమకారులు ఎండి.జహూరద్దీన్,అంబటి నర్సయ్య,తౌట రమేష్,బండారి సిద్దయ్య,దూడం అంజయ్య,లక్ష్మయ్య,చింతల వెంకటేష్,తదితరులు ఉన్నారు.


నర్సాపూర్‌లో బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వంశీగౌడ్ కు నియామకపు పత్రాన్ని అందజేస్తున్న వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తదితరులు

## బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా వంశీగౌడ్ నియామకం

**నర్సాపూర్ జూన్ 9. ప్రభాతవార్త :** నర్సాపూర్ మండల బిజెపి పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా నర్సాపూర్ పట్టణానికి చెందిన వంశీగౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం నర్సాపూర్‌లో బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ చేతుల మీదుగా మండల ప్రధాన కార్యదర్శిగా నియామకపు పత్రా న్ని అందజేయడం జరిగింది, ఈసందర్భంగా నూతనంగా బిజెపి మండల ప్రదాన కార్యదర్శిగా ఎన్నికైన వంశీగౌడ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి బిజెపి పార్టీ భలోపేతానికి కృసి చేస్తానని తెలిపారు. ఈపదవిని కట్టబెట్టినందులకుగాను బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ కు తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పుల్కల్, జూన్ 9, ప్రభాతవార్త:** 1998-99 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో కలిసి చదువు కుని ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించి కార్యక్రమాన్ని ఆరంభించారు. విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ నేడు సాగుతున్న జీవిత తీరుపై కులాసాగా చర్చించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రధానోపాధ్యాయులు అంజయ్య, ఉపాధ్యాయులు కృష్ణగౌడ్, మాణిక్‌రావు, నర్సింలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం మరిచిపోలేని మధుర స్మృతి

**గజ్వేల్, జూన్ 9 (ప్రభాతవార్త):** గజ్వేల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం గజ్వేల్ పట్టణంలోని పిఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు కోదండరాములుశర్మ, సంజీవరెడ్డి, జైపాల్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులను కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. 10వ తరగతి పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు ఒకచోట కలుసుకోవడం మంచి అనుభూతినిస్తుందన్నారు. సిద్దిపేట జిల్లా మంచి ఫలితాలు తెచ్చే జిల్లాగా పేరుండేదని అన్నారు. 20 సంవత్సరాల తర్వాత విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడం చూసి ఎంతో గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్‌సిసి శిక్షణ శిబిరం

గజ్వేల్, జూన్ 9 (ప్రభాతవార్త): గత పది రోజులుగా గజ్వేల్ బాలుర విద్యా సముదాయంలో విజయవంతంగా నిర్వహించబడుతున్న ఎన్‌సిసి సంయుక్త శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు నిర్వహించారు. మొదటగా పది రోజుల శిబిరంలో కాడేట్‌లకు అందించిన శిక్షణను మరియు శిబిర నివేదికను క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ భవానికి అందజేశారు. సంగారెడ్డి బెటాలియన్ కమాండెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పార్థసారధి నందా వారి సతీమణి ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చిన్మయదత్త హాజరుకావడం జరిగింది. అనంతరం ముఖ్య అతిథి అయిన ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సిసి విద్యార్థుల భవిష్యత్తుకి ఎంతగానో ఉపయోగపడుతుందని, శిక్షణ వల్ల క్రమశిక్షణ మరియు నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన, ఉత్తమ సేవలు అందించిన కాడేట్‌లకు మెడల్స్‌ను బహూకరించారు. ఈ క్యాంపు నిర్వహణకు వసతి కల్పించిన జిల్లా కలెక్టర్‌కు, సంక్షేమ అధికారులకు, మెడికల్ సిబ్బందికి, మున్సిపల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత

### -సమాజాబివృద్ధి గురువుల చేతుల్లోనే ఉంది
### -శ్రీకర సత్య సేవ వ్యవస్థాపకులు నూతి శ్రీకరశర్మ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

**వర్గల్, జూన్ 9 (ప్రభాతవార్త):** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ప్రముఖ న్యాయవాది, శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు నూతి శ్రీకరశర్మ పేర్కొన్నారు. ఆదివారం వర్గల్ మండలకేంద్రంలో పేద విద్యార్థులకు నోటుబుక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడంతో పాటు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు నూక లింగమూర్తిగుప్తను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో గురువు పాత్ర ఎంతో విలువైనదని, ప్రపంచంలో మేధావులుగా పిలువబడే స్వామి వివేకానంద, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, రామకృష్ణ పరమహంస వంటి ప్రముఖులను తీర్చిదిద్దింది గురువులేనని తెలిపారు. అయితే సమాజ ప్రగతికి స్వలాభం లేకుండా ముందుకు సాగాలని, గ్రామీణ విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి సమాజానికి అందించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో 22 ఏళ్లుగా విద్యార్థులను తీర్చిదిద్దిన గురువు లింగమూర్తిగుప్త భవిష్యత్తులో విద్యార్థులకు బంగారు బాట చూపాలని కోరారు. విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడు లింగమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా గ్రామీణ విద్యార్థులకు సేవలందించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, ఉపాధ్యాయ వృత్తి తనకు ఎంతో సంతృప్తి కలిగించిందని తెలిపారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మనిగండ్ల శ్రీనివాస్, శామీర్‌పేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కిష్టయ్యగుప్త, వర్గల్ మండల బిజెపి అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిక్షపతిగుప్త తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

గజ్వేల్, జూన్ 9 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని భారత్‌నగర్ వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి రోడ్ల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో ఎక్కడైతే సిసి రోడ్లు లేవో అక్కడ సిసి రోడ్లు వేయిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన వెంట కాంట్రాక్టర్ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి